




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 | పేజీలు 04 | వెల రూ: 2/- | సంపుటి 01 ,సంచిక 270 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత


## ఐఏఎస్ అధికారుల భారీ బదిలీలు... రాష్ట్రవ్యాప్తంగా 45 మంది అధికారులకు కొత్త బాధ్యతలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 27: రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఐఏఎస్ అధికారులపై విస్తృత స్థాయిలో బదిలీలు, నియామకాలు చేపట్టింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (ఎస్‌పీఎల్-ఏ) శాఖ జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం. 290 ప్రకారం మొత్తం 45 మంది ఐఏఎస్ మరియు ఎస్‌సీఎస్ అధికారులకు కొత్త పోస్టింగులు కల్పించింది. సీనియర్ స్థాయిలో సంజయ్ కుమార్‌ను ప్రజారోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖలకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ఎన్. శ్రీధర్‌ను సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించగా, రాహుల్ బొజ్జాను సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌కు ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. జిల్లాల స్థాయిలో పలువురు కలెక్టర్లను మార్చి కొత్త నియామకాలు చేశారు. జంగావ్, మహబూబాబాద్, హనుమకొండ, మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో కొత్త కలెక్టర్లను నియమించారు. అలాగే అదనపు కలెక్టర్లు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు, విభిన్న శాఖల డైరెక్టర్లకు కూడా బదిలీలు అమలు చేశారు. గవర్నర్ పేరున జారీ చేసిన ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వచ్చినట్లు ప్రధాన కార్యదర్శి వెల్లడించారు.

## ప్రభుత్వ ఐవీఎఫ్ సేవలతో తొలి శిశువు జననం గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌కు రాష్ట్ర స్థాయి గుర్తింపు



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రతినిధి):గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌లో ఐవీఎఫ్ చికిత్స పొందిన తొలి మహిళ ఇటీవల పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఐవీఎఫ్ సేవల ద్వారా జన్మించిన తొలి శిశువుగా ఈ పాప పుట్టుక కొత్త రికార్డు సృష్టించింది.ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (IIHFW) లో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గాంధీ హాస్పిటల్ ఐవీఎఫ్ సెంటర్‌లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని అభినందించారు.ఐవీఎఫ్ సెంటర్ హెడ్ డాక్టర్ శోభ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుమిత్ర నాయర్, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఫాతిమా రాణి, ఎంబ్రయాలజిస్ట్ శివకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ పద్మావతి తదితరులను మంత్రి ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.ప్రభుత్వ స్థాయిలో అందిస్తున్న ఐవీఎఫ్ సేవలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఉపశమనం కలిగిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలి,మార్చి మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం

## రాష్ట్రంలోనే అతిపెద్దగా 2,160 ఇండ్లు ఒకే చోట నిర్మాణం





సూర్యాపేట, ఫిబ్రవరి 27 (ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించి రూ.22,500 కోట్ల బడ్జెట్‌తో వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. గురువారం హుజూర్నగర్‌లోని రామస్వామి వద్ద 110 ఎకరాలలో రూ.125 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి ప్రతి బ్లాక్‌ను కాలినడకన పరిశీలించారు.ఈ సందర్భంగా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఎలక్ట్రిసిటీ, మొక్కల నాటడం, వైట్ వాష్ పనులను సమీక్షించారు.

మీడియా సమావేశంలో మంత్రి వ్యాఖ్యలు,అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే కార్మికులకు ఆశ్రయం కల్పించాలనే లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకు కొనుగోలు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఆనాటి ప్రభుత్వం పనులను నిలిపివేసి డంపింగ్ యార్డ్ మాదిరిగా మార్చిందని విమర్శించారు.ప్రస్తుతం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 14 ఏళ్ల పట్టుదలతో పనులను పునఃప్రారంభించి పూర్తి చేయడం తన చిరకాల స్వప్నం నెరవేరుతోందని మంత్రి పేర్కొన్నారు.ఒక్కో ప్లాట్‌పై సుమారు రూ.6 లక్షలు ఖర్చు అవుతుందని, భూమితో కలిపి మొత్తం వ్యయం సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని వివరించారు. ఒక్కో ఇల్లు 325 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించబడుతోందని తెలిపారు.రూ.75 కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల పనులు చేపట్టామని, అవసరమైతే రాత్రింబవళ్లు పనులు పూర్తి చేసి మార్చి మొదటి వారంలో పెండింగ్ పనులు ముగిస్తామని వెల్లడించారు.

తొలి విడతలో 1000 మందికి పంపిణీ మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తొలి విడతలో హుజూర్నగర్ ప్రాంతానికి చెందిన తెల్ల రేషన్ కార్డు కలిగిన నిరుపేదలకు 1000 ఇండ్లను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. రెండో విడతలో నియోజకవర్గంలోని ఇతర అర్హులైన పేదలకు అందజేయనున్నట్లు తెలిపారు.లబ్ధిదారుల ఎంపికను ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, తహసీల్దార్‌లు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవినీతి లేదా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ కే. నరసింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఆర్కిటెక్చర్ పీడీ నాగయ్య, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి – ముఖ్యాంశాలు

- రూ.1642 కోట్లతో మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచి కెనాల్ ఎత్తిపోతల పథకం అమలు
- 45 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం
- 3 మండలాల్లోని 23 గ్రామాలకు తాగునీటి సరఫరా
- 16 మెగావాట్ల సామర్థ్యంతో 4 పంపుసెట్ల ద్వారా 160 మీటర్ల లోతు నుండి నీటి ఎత్తిపోత
- ప్రాజెక్టు కోసం 198 ఎకరాల భూసేకరణ పూర్తి
- రైతులకు రూ.53 కోట్ల పరిహారం చెల్లింపు
- వచ్చే సెప్టెంబర్ నాటికి ప్రాజెక్టు పూర్తి చేసే లక్ష్యం
- పనుల పురోగతిపై ప్రత్యక్షంగా పరిశీలన, సమీక్ష సమావేశం నిర్వహణ
- సాగునీరు, తాగునీరు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం

### మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచి కెనాల్ ఎత్తిపోతల పథకం పనులపై సమీక్ష

## రూ.1642 కోట్లతో 45 వేల ఎకరాలకు సాగునీరు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సూర్యాపేట, ఫిబ్రవరి 27 (ప్రతినిధి): చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద రూ.1642 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచి కెనాల్ ఎత్తిపోతల పథకం పనులను రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సందర్శించి, అనంతరం ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు ద్వారా 45 వేల ఎకరాలకు సాగునీరు అందించబడుతుందని తెలిపారు. అదేవిధంగా మూడు మండలాల్లోని 23 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. మట్టపల్లి మండలంలోని 9 గ్రామాలు, చింతలపాలెం మండలంలోని 5 గ్రామాలు, మేళ్లచెరువు మండలంలోని 9 గ్రామాలు మొత్తం 23 గ్రామాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నట్లు వివరించారు.16 మెగావాట్ల సామర్థ్యం గల 4 పంపుసెట్ల ద్వారా 160 మీటర్ల లోతు నుండి నీటిని ఎత్తిపోసి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలుకోసం 198 ఎకరాల భూసేకరణ పూర్తి చేసి, రైతులకు రూ.53 కోట్ల పరిహారం చెల్లించామని వెల్లడించారు.వచ్చే సెప్టెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల ఎస్సీ నాగభూషణం, కాంట్రాక్టర్లు, రైతులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ హాజరు శాతం 98.03 నమోదు

సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (ప్రతినిధి): జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్ల పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు.జిల్లాలో మొత్తం 15,515 మంది విద్యార్థులు పరీక్షలకు నమోదు కాగా, అందులో 15,209 మంది హాజరయ్యారు.హాజరైన వారిలో: జనరల్ కోర్సుకు చెందిన 14,296 మంది వృత్తి (వొకేషనల్) కోర్సుకు చెందిన 913 మంది మొత్తం 306 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జనరల్ కోర్సు – 259 మంది, వృత్తి కోర్సు – 47 మంది, మొత్తం హాజరు శాతం 98.03 నమోదైందని పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణపై అధికారులు విస్తృతంగా పర్యవేక్షణ నిర్వహించారు. కన్వీనర్/డీఐఈఓ 2 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 11 కేంద్రాలు, హెచ్‌పీసీ సభ్యులు 5 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు 14 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.పరీక్షలు క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించబడినట్లు అధికారులు వెల్లడించారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేత రెండు రోజుల పాటు సరఫరా నిలిచిపోనుంది

సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (ప్రతినిధి): మిషన్ భగీరథ పరిధిలో సింగూరు ఆనకట్ట వద్ద ఉన్న బూసరెడ్డిపల్లి 100 ఎంఎల్డీ నీటి శుద్ధి కర్మాగారంలో ఫిల్టర్ బెడ్ మరమ్మత్తు పనులు చేపడుతున్న కారణంగా ఫిబ్రవరి 27 (శుక్రవారం), 28 (శనివారం) తేదీలలో నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నేపథ్యంలో మునిపల్లి, కోహిర్, ఝరాసంఘం, జహీరాబాద్, మొగుడంపల్లి, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్, అమీన్పూర్, పటాన్‌చెరు మున్సిపాలిటీలు మరియు సంబంధిత మండలాల పరిధిలో నీటి సరఫరా నిలిచిపోతుందని ఆమె వెల్లడించారు.మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే సాధారణ నీటి సరఫరా పునరుద్ధరించబడుతుందని తెలిపారు.ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి, నీటిని పొదుపుగా వినియోగిస్తూ సహకరించాలని అధికారులు కోరారు.

## స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

### మార్చి 13 నుంచి మండల స్థాయి పోటీలు ప్రారంభం

సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి – టీ. సంగమేశ్వర్): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాల ఆదేశాల మేరకు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడాశాఖ అధికారి టి. అఖిలేష్ రెడ్డి తెలిపారు.మొదటగా మండల స్థాయి ఎంపికలు మార్చి 13 నుంచి మార్చి 17, 2026 వరకు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో నిర్వహించబడతాయి. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు.

జిల్లా స్థాయి ఎంపిక పోటీలు మార్చి 30, 31 తేదీలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 4, 2026 లోపు https://tgss.telangana.gov.in/� వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

అర్హతలు:

నాలుగో తరగతి ప్రవేశం కోసం 8 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలి.

(01-09-2017 నుంచి 31-08-2018 మధ్య జననం ఉండాలి)

ప్రస్తుతం నాలుగో తరగతి చదవబోయే విద్యార్థులు మాత్రమే అర్హులు.

తీసుకురావాల్సిన పత్రాలు:

ప్రస్తుత పాఠశాల నుంచి వయస్సు మరియు స్టడీ సర్టిఫికేట్

జనన నమోదు ధృవీకరణ పత్రం (ఎంఆర్వో/పంచాయతీ/మున్సిపాలిటీ/కార్పొరేషన్)

మూడో తరగతి పురోగతి నివేదిక ప్రతులు

ఆధార్ కార్డ్

కుల ధృవీకరణ పత్రం

ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు

ఎంపిక పరీక్షల వివరాలు:

ఆంత్రోపోమెట్రిక్ కొలతలు:

ఎత్తు

బరువు

మోటార్ నైపుణ్య పరీక్షలు:

30 మీ. ఫ్లయింగ్ స్టార్ట్

స్టాండింగ్ బ్రాడ్ జంప్

6x10 మీ. షటిల్ రన్

వర్టికల్ జంప్

ఫ్లెక్సిబిలిటీ టెస్ట్

1 కేజీ మెడిసిన్ బాల్ పుట్

800 మీటర్ల పరుగుపందెం

మెడికల్ టెస్ట్:

వయస్సు నిర్ధారణ

మండల మరియు జిల్లా స్థాయి ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు పై పేర్కొన్న పత్రాల ఒరిజినల్ మరియు జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని డీవైఎస్ఓ టి. అఖిలేష్ రెడ్డి సూచించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన హిమాచల్ ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రతినిధి):తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర మంత్రి విక్రమాదిత్య సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరురాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, అభివృద్ధి కార్యక్రమాలు మరియు పరిపాలన అనుభవాలపై చర్చించినట్లు తెలిసింది.రాష్ట్రాల అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులపై కేంద్ర బృందానికి ప్రజెంటేషన్ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వివరణ

సూర్యాపేట, ఫిబ్రవరి 27 (ప్రతినిధి): జిల్లాలో అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై కేంద్ర బృందానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరణ అందించారు.మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం VB–GRAMG గా మారుస్తున్న నేపథ్యంలో, కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ (MORD) బృందం సభ్యులు సంజయ్ కుమార్ నేతృత్వంలో ఫిబ్రవరి 26 నుండి 28, 2026 వరకు సూర్యాపేట జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్‌తో సమావేశమై పథకం అమలు పురోగతిని సమీక్షించారు.సమావేశంలో జిల్లాలో చేపట్టిన ఉపాధి హామీ పనులు, లక్ష్యాలు, సాధించిన ఫలితాలు తదితర అంశాలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈజీఎస్ పథకాల పనుల ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం సభ్యులు, కలెక్టర్ తిలకించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డిప్యూటీ సీఈవో శిరీష, కేంద్ర బృందం సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## తెలంగాణ విద్యావిధానంపై సీఎంకు నివేదిక విద్యా కమిషన్ చైర్మన్ఆ కునూరి మురళీ సమర్పణ

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర విద్యావిధానంపై సమగ్ర అధ్యయనం నిర్వహించిన విద్యా కమిషన్ తన నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించింది. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ నేతృత్వంలో కమిషన్ సభ్యులు సీఎంను కలిసి రాష్ట్ర విద్యా రంగంలో చేపట్టాల్సిన సంస్కరణలు, విధాన పరమైన మార్పులు, నాణ్యతాభివృద్ధి చర్యలపై రూపొందించిన సిఫార్సులను అందజేశారు.ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు పాఠ్యాంశాల మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయ శిక్షణ, సాంకేతిక వనరుల వినియోగం, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై నివేదికలో ప్రత్యేక సూచనలు చేసినట్లు తెలిసింది.ఈ సందర్భంగా సీఎం విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కమిషన్ సిఫార్సులను పరిశీలించి దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు.విద్యా కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## దళితులకు ఉన్నత విద్య అందించడం సర్కార్ లక్ష్యం త్వరలో అంబేద్కర్ టవర్ – ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ హైదరాబాద్‌లోనే ఎస్సీ విద్యార్థులకు అత్యుత్తమ గ్రూప్-1, గ్రూప్-2 శిక్షణ

ప్రధాన లక్ష్యం: దళిత విద్యార్థులకు ఉన్నత, కార్పొరేట్ స్థాయి విద్య అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.

అంబేద్కర్ భవన్: లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్‌ను మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నారు.

హాస్టల్ కాంప్లెక్స్: కాచిగూడలోని ఎస్సీ హాస్టల్‌ను రెసిడెన్షియల్ అకాడమిక్ సెంటర్‌గా మార్చే ప్రణాళికలు.

సివిల్స్ కోచింగ్: ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ సౌకర్యాలను హైదరాబాద్‌లోనే అందించడానికి చర్యలు.

నూతన సదుపాయాలు: డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్, గెస్ట్ లెక్చర్స్, మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ & పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు.

పూర్తి సౌకర్యాలు: హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి సదుపాయాలు కోచింగ్ తీసుకునే విద్యార్థులకు.

పారదర్శక ఎంపిక విధానం: గ్రామీణ విద్యార్థులకు ప్రత్యేక ప్రాధాన్యత, మెరిట్ ఆధారంగా ఎంపిక, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కోచింగ్ విస్తరణ.

ఆత్మవిశ్వాస పెంపు: ఎస్సీ యువతలో ఆత్మవిశ్వాసం పెంచే మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీల ప్రతినిధిత్వం పెంచడం.

తాజా వ్యక్తీకరణ: తమిళనాడు మోడల్‌ప్రకారం అత్యాధునిక భవనాలు, అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్‌లు నిర్మాణం.

ప్రాంతీయ నాయకులు: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, దళిత సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రతినిధి):దళితులకు ఉన్నత విద్యను కార్పొరేట్ స్థాయిలో అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రతిభావంతులైన దళిత విద్యార్థులు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందాలంటే చదువే ఒక్కటే మార్గమని పేర్కొన్నారు.బుధవారం 59 దళిత కులాల సంఘాల నాయకులు లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్ మరియు కాచిగూడలోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్‌ను మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కాచిగూడ హాస్టల్ కాంప్లెక్స్‌ను రెసిడెన్షియల్ అకాడమిక్ సెంటర్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

సివిల్స్ కోచింగ్ కోసం తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, ఖర్చుతో కూడిన ఆ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ సౌకర్యాలను హైదరాబాద్‌లోనే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.విద్యార్థుల కోసం డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ గెస్ట్ లెక్చర్స్, మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థులకు హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అడ్మిషన్‌లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, మెరిట్ ఆధారంగా పారదర్శక ఎంపిక విధానం అమలు చేస్తామని తెలిపారు. కోచింగ్ సెంటర్లను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.ఎస్సీ యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా మార్గదర్శకాలు రూపొందించి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీల ప్రతినిధిత్వం పెరగడానికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు. తమిళనాడు మోడల్‌లో అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనాలు నిర్మించి అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్లుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పేద విద్యార్థిని ఒక మంచి పరిపాలకుడిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## గిరిజన సంప్రదాయ కళలపై ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ శిక్షణ ప్రారంభం

సందేశం టైమ్స్, ఫిబ్రవరి 26 (సందేశం టైమ్స్ ప్రతినిధి): గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ సూచనల మేరకు, TCR & TI, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ కోసం ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ ప్రారంభమైంది. ఈ శిక్షణ 26 ఫిబ్రవరి నుంచి 2 మార్చ్ 2026 వరకు హైదరాబాద్‌లోని TRI వేదికలో జరుగుతోంది. ఉట్నూర్, ఎటునాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా ప్రాంతాల నుండి ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ అయిన అభ్యర్థులు పాల్గొంటున్నారు. శిక్షణలో భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పించబడ్డాయి, అలాగే 10 మంది గిరిజన ఆర్టిజన్స్‌కు ప్రతిరోజు 1,000 రూపాయల అనరోరియం ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో TRI సంచాలకుడు డాక్టర్ వి. సముజ్వల, TRI సంగ్రహాలయ సంరక్షకుడు డాక్టర్ డి. సత్యనారాయణ, SHHOP డైరెక్టర్ డాక్టర్ సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ మరియు TRI సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిక్షణ ద్వారా గిరిజన సంప్రదాయ కళలను పునరుజ్జీవితం చేసి, నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారని అధికారులు తెలిపారు.



## CM R. రేవంత్ రెడ్డి ఐసీసీ లో ఎడ్యుకేషన్ సమీక్ష నిర్వహించారు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఐసీసీ లో విద్యా విభాగంపై సమీక్ష నిర్వహించారు. సమీక్షకు హాజరైన వారు: సీఎం సలహాదారు వేం నరేంద్ర రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి. సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాల పెంపు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణంలో కచ్చితమైన అంగీకారం అవసరం, భారతీయ విద్యా భవన్ మరియు జూబ్లీ హిల్స్ పబ్లిక్ స్కూల్‌ల మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండేలా చూసుకోవడం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ సమర్థవంతంగా అమలు, పాలుపై పకడ్బందీగా పర్యవేక్షణ, మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం AI టెక్నాలజీ వినియోగం, కోర్ అర్బన్ రీజియన్ మినహా ప్రతి మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో అన్ని సౌకర్యాలు కల్పించడం, విద్యార్థుల ట్రాన్స్పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు, ప్రైవేట్ స్కూల్‌ల ఫీజుల నియంత్రణకు సంబంధించి ప్రజాభిప్రాయాన్ని వెబ్‌సైట్ ద్వారా తీసుకోవడం వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.



## 100 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో ఈ ఏడాది ప్రారంభించే వంద తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పై సమీక్ష నిర్వహించారు. ఇవి ఆరుట్ల పాఠశాల తరహాలో, తరగతి గదులు, క్రీడా మైదానాలు, ఇతర మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యాలతో ఉండేలా రూపొందిస్తారని సీఎం స్పష్టం చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్ది, ఏడాదిలో 12 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, పాలుపై పర్యవేక్షణ, స్కూల్ కిట్లు, యూనిఫార్మ్, పుస్తకాలు, ప్యాకేజ్ సప్లైలు అందించడం, పాలిటెక్నిక్, ఏటీసీల్లో AI ఆధారిత కోర్సులు, మరియు విశ్వవిద్యాలయాలకు నిధుల కేటాయింపు వంటి అంశాలపై సీఎం దృష్టి సారించారు. ప్రైవేట్ స్కూల్‌ల ఫీజుల నియంత్రణకు రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలోని రాష్ట్ర కమిటీ విధులు చేపట్టడం, అభిప్రాయాల సేకరణ కోసం వెబ్‌సైట్ ఉపయోగించడం, నియోజకవర్గ స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాఠశాలల పరిశీలనలో భాగస్వామ్యం అవ్వడం వంటి మార్గదర్శకాలు సీఎం నిర్దేశించారు. తెలంగాణ విద్యా విధానంపై నివేదికను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, సభ్యులు ముఖ్యమంత్రికి సమర్పించి, చట్టబద్ధత కల్పించాల్సిన అంశాలు, అమలు చేయాల్సిన అంశాలపై కేశవరావు కమిటీకి బాధ్యత అప్పగించారు.సమీక్షలో సీఎం సలహాదారు వేంనరేంద్ర రెడ్డి, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇతర ఉన్నత విద్యా అధికారులు, విశ్వవిద్యాలయాలు, ఇంటర్మీడియట్ బోర్డు, పాఠశాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ రాజు బదిలీ - మెదక్ కొత్త కలెక్టర్‌గా ప్రతిమ సింగ్ నియామకం



మెదక్, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న రాహుల్ రాజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసి సహకార శాఖ ప్రత్యేక కమిషనర్ మరియు సహకార సంఘాల రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2024 మార్చి 6న ఆదిలాబాద్ నుంచి బదిలీపై మెదక్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చురుకైన పాత్ర పోషించారు. ఇదిలా ఉండగా, రంగారెడ్డి (లోకల్ బాడీస్) అదనపు కలెక్టర్‌గా ఉన్న 2019 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ప్రతీమ సింగ్‌ను మెదక్ జిల్లా కొత్త కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆమె త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

## రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా రెండోసారి కే. శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా రెండోసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన కే. శ్రీనివాస్ రెడ్డి గారికి అందోల్ ప్రెస్ క్లబ్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ, అక్షరాన్ని ఆయుధంగా మార్చుకుని నవ సమాజ నిర్మాణ దిశగా కృషి చేస్తున్న ఆయన పత్రికా రంగంలోనే కాకుండా జర్నలిస్టుల నాయకుడిగా సమర్థవంతమైన పాత్ర పోషిస్తున్నారని క్లబ్ గుర్తుచేసింది. ఎవరికి అన్యాయం జరుగకుండా న్యాయం సాధించేందుకు కట్టుబడి పనిచేస్తున్న ఆయన సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షలు తెలిపారు.

## ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా సాగాయి - హాజరు శాతం 98.03%

తెలంగాణ | సంగారెడ్డి జిల్లా

సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్లు గురువారం ప్రశాంతంగా, సజావుగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు. మొత్తం 15,515 మంది విద్యార్థులకు గాను 15,209 మంది హాజరై హాజరు శాతం 98.03% నమోదు అయినట్లు తెలిపారు. వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 14,296 మంది, వృత్తి కోర్సుకు చెందిన 913 మంది విద్యార్థులు హాజరైనారు. మొత్తం 306 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు, అందులో 259 మంది జనరల్, 47 మంది వృత్తి కోర్సు విద్యార్థులు ఉన్నారని గోవింద్ రామ్ పేర్కొన్నారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణకు కన్వీనర్/డీఐఈఓ 2 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 11 కేంద్రాలు, హెచ్‌పీసీ సభ్యులు 5 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు 14 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేశారు.




## హిందీ ప్రతిభా రత్నలో డివిజన్ స్థాయిలో స్వర్ణ పథకం సాధించిన ఎన్. ఆదిలక్ష్మి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): తెలంగాణ హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన హిందీ ప్రతిభా రత్న పురస్కార్ పోటీ పరీక్షల్లో నారాయణఖేడ్ మండలం హనుమాన్ మందిర్ తండా గ్రామానికి చెందిన ఎన్. ఆదిలక్ష్మి (7వ తరగతి, వాటికన్ హై స్కూల్) డివిజన్ స్థాయిలో స్వర్ణ పథకం సాధించటం ఘనమైన విజయం. ఈ విషయాన్ని సభ రాష్ట్ర అధ్యక్షులు కె. రామచందర్ వెల్లడించారు.విజయం సాధించిన విద్యార్థినిని నారాయణఖేడ్ డిప్యూటీ కలెక్టర్ ఉమా హారతి అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంతృప్తి, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మరియు సభ ప్రతినిధులు కూడా పాల్గొని విద్యార్థిని అభినందించారు.



## విశ్వకర్మ దిశా దశ చైతన్య యాత్ర ఘన ప్రారంభం – అంతారం నుంచి మంచిర్యాల వరకు రథయాత్ర

మెదక్, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం అంతారం గ్రామంలో ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండీ కొండోజు నరసింహాచారి ఆధ్వర్యంలో "విశ్వకర్మ దిశా దశ చైతన్య యాత్ర" ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని విశ్వకర్మల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ చైతన్య రథయాత్రను చేపట్టారు. కార్యక్రమానికి బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, రాష్ట్ర మనుమయ సంఘం అధ్యక్షులు సుంకోజు కృష్ణమాచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు విశ్వకర్మలు వందల సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలకు సరైన పరిష్కారం ఇప్పటివరకు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొండోజు నరసింహాచారి రాష్ట్రంలోని 33 జిల్లాల్లో యాత్ర నిర్వహించి ప్రతి జిల్లాలో సమస్యలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తారని, 411 యాక్ట్‌లో సవరణలు, ఫారెస్ట్ అధికారులతో వడ్రంగి సోదరులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యే వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. స్వర్ణకారులపై అక్రమ ఒత్తిళ్లు, రికవరీలు ఉంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు అనంతోజు నాగరాజు చారి, గంధాల శ్రీనివాస్ చారి, మేడోజు రామరాజు చారి, బిచ్కుంద స్వర్ణకార సంఘం అధ్యక్షులు కృష్ణ చారి, గ్రామ ప్రజలు, పోలీసులు పాల్గొన్నారు. 33 జిల్లాల పర్యటన అనంతరం హైదరాబాద్‌లో ఐదు లక్షల మంది హాజరుకానున్న భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




## "అరైవ్ అలైవ్-2026" తో రోడ్డు భద్రతపై జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్-2026" ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత, రోడ్డు భద్రతా చర్యలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. విద్యార్థులు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ఎస్పీ పరితోష్ పంకజ్ హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉపయోగం తప్పనిసరి అని, పాదచారులకు ప్రాధాన్యత ఇవ్వడం, ఇతరుల నిర్లక్ష్యాన్ని ముందుగానే అంచనా వేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు

## బోగరి జిన్ రాజ్ పదవి విరమణకు ఘన అభినందన సభ



జహీరాబాద్, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్): జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మండలం పరిధిలోని గురుజువాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బోగరి జిన్ రాజ్ పదవీ విరమణ సందర్భంగా భావోద్వేగభరిత వాతావరణంలో ఘన అభినందన సభ నిర్వహించబడింది. దీర్ఘకాలం విద్యార్థులకు అంకితభావంతో బోధన చేసి అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చిన జిన్ రాజ్ సేవలను సభలో వక్తలు ప్రశంసించారు. క్రమశిక్షణ, సమయపాలన, విద్యార్థుల పట్ల మమకారం వంటి గుణాలతో ఆయన ఉపాధ్యాయ వృత్తికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్, సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, జహీరాబాద్ విభాగ మహిళా రక్షణ అధ్యక్షురాలు సుమిత్ర, న్యాల్ కల మండల అధ్యక్షులు నవీన్ కుమార్ పాల్గొని జిన్ రాజ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు వీడ్కోలు పలికారు.పలువురు విద్యార్థులు ఆయన బోధన శైలి తమ జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందని గుర్తుచేసుకుంటూ, సాదాసీదా ఉపాధ్యాయుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం వేలాది మంది విద్యార్థుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే గురువుగా ముగిసిందని అభిప్రాయపడ్డారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన సమాజ సేవలో కొనసాగాలని సభలో పాల్గొన్నవారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయ వృత్తికి ఉన్న గౌరవాన్ని మరోసారి చాటిచెప్పింది

## కయిదంపల్లిలో మహిళా సమాఖ్య భవనానికి భూమిపూజ నిర్వహణ



మెదక్, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్, బి. రమేష్ బాబు): మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండలంలోని కయిదంపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో ఈ భవన నిర్మాణం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

వట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి కొప్పుల లక్ష్మి శేషారెడ్డి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళల అభివృద్ధి, సమావేశాలు మరియు శిక్షణ కార్యక్రమాల కోసం ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ రేణుక సిద్దు, ఏఈ పీఆర్ రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ రావు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, పంచాయతీ కార్యదర్శి నవీన్, సీసీలు ఇందిరా, కవిత, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీను, నాయకులు శేఖర్ పటేల్, జైపాల్, బాలరాజ్, సంగమేష్, ఉప సర్పంచ్ శ్రీశైలం, కిషన్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముస్లాపూర్‌లో గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన కొప్పుల లక్ష్మి శేషారెడ్డి



మెదక్, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్, బి. రమేష్ బాబు): మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామంలో సురేష్ సెట్ గారి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వట్టిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి కొప్పుల లక్ష్మి శేషారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు శాలువాతో సన్మానం చేసి ఆత్మీయ స్వాగతం పలికారు. గృహప్రవేశం సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఆమె, గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం అందిస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్ రావు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, శేఖర్ పటేల్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింలు, బలకిషన్, శ్రీశైలం, సురేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పుల్కల్‌లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహణ



సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్, బి. రమేష్ బాబు): సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గం పుల్కల్ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు కంకోల్ మీనా భరత్ గారి కొత్త గృహంలో గృహప్రవేశం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేదల స్వంత ఇల్లు కల నెరవేరుతోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, కంకోల్ ప్రభాకర్, సదానందం, భరత్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 27న వట్‌పల్లి రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

Village wise Kalyanalakshmi & Shadi Mubaraq cheques details, vatpally Mandal

| SL.NO | Name of the Village | No.of Beneficiaries |
|---|---|---|
| 1 | Bhutukur | 4 |
| 2 | Buddaipally | 2 |
| 3 | Dudyal | 7 |
| 4 | Keroor | 2 |
| 5 | Khadirabad | 2 |
| 6 | Marvelly | 5 |
| 7 | Nagulapally | 5 |
| 8 | Nirjapla | 2 |
| 9 | Paladugu | 4 |
| 10 | Palvatla | 3 |
| 11 | Pothulaboguda | 6 |
| 12 | Shahednagar | 3 |
| 13 | Usirikapally | 4 |
| 14 | Vatpally | 5 |
| | Total | 54 |

సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్, టి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటలకు మండల రైతు వేదికలో పంపిణీ చేయనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రతాప్ రమేష్ జోషి తెలిపారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మరియు లబ్ధిదారులు సమయానికి హాజరై చెక్కులు స్వీకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యమని తెలిపారు. "లబ్ధిదారులు తప్పనిసరిగా హాజరై ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలి" అని ఆయన సూచించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు



సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్, టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో కరస్ గుత్తి రోడ్‌లో ఉన్న హెచ్ ఆర్ ప్యాలెస్‌లో వివాహ వేడుక ఘనంగా జరిగింది. మానూర్ మండలం రాణపూర్ గ్రామానికి చెందిన పోలీస్ పట్లోళ్ళ అశోక్ కుమారుడి వివాహ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆనందోత్సాహాల మధ్య కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. పలువురు బంధుమిత్రులు, ఆహ్వానితులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



## రెండు రోజులు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

సంగారెడ్డి, ఫిబ్రవరి 27 (సందేశం టైమ్స్, టీ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో మిషన్ భగీరథ పరిధిలోని సింగూరు ఆనకట్ట సమీప బూసరెడ్డిపల్లి 100 ఎంఎల్డీ నీటి శుద్ధి కేంద్రంలో ఫిల్టర్ బెడ్ మరమ్మత్తు పనులు చేపట్టిన నేపథ్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో (శుక్రవారం, శనివారం) నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి తెలిపారు.ఈ కారణంగా మునిపల్లి, కోహీర్, ఝురాసంఘం, జహీరాబాద్, మొగుడంపల్లి, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్, అమీన్పూర్, పటాన్‌చెరు మున్సిపాలిటీలు మరియు సంబంధిత మండలాల పరిధిలో నీటి సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.మరమ్మత్తు పనులు పూర్తయ్యిన వెంటనే సాధారణ నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని, ప్రజలు సహకరించాలని మిషన్ భగీరథ అధికారులు విజ్ఞప్తి చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.